క్లుప్తంగా

'హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలి'



జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావుకు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులను హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజు కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుసేవా కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా కొన్నిచోట్ల వ్యవసాయ విస్తరణ అధికారులను గ్రామ స్థాయిలోని రైతుసేవా కేంద్రాల్లో వేయడం తగదన్నారు. కార్యదర్శి పి. కూర్మారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని ఆశించామని, అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 15 ఏళ్లకు పైబడి వ్యవసాయ విస్తరణ అధికారులుగా పనిచేస్తున్నా కనీసం ఉద్యోగోన్నతి కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా కోశాధికారి ఎం. సూరిబాబు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి. జగన్నాథరావు, సభ్యులు హేమ, మహేశ్వరరావు, గిరిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులకు అల్పాహారంగా అరటి పండ్లు అందజేస్తున్న లైబ్రేరియన్ మహేష్

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సందడి వాతావరణంలో కొనసాగుతోంది. సోమవారం విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసి వివిధ రకాల పుస్తకాలు చదివారు. లైబ్రేరియన్ వై.మహేష్ విద్యార్థులకు క్యారమ్ బోర్డు, స్నేక్ అండ్ లేటర్ గేమ్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు అల్పాహారంగా లైబ్రేరియన్ మహేష్ అరటిపండ్లను అందజేశారు.

కనీస వేతనం ఇవ్వాలి



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న రామారావు

నెల్లిమర్ల రూరల్: ఉపాధి వేతనదారులకు కనీస వేతనం రూ.300 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని కోరాడపేట గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించి వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. వేతనదారులకు అరకొర వేతనాలే చెల్లిస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే వేతనదారులకు శ్రమకు దగ్గ ఫలితం దక్కడం లేదని ఆరోపించారు. ఎండల నేపథ్యంలో పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి



బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి

బొండపల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు, అసలు ఆ సమస్యే రాకుండా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) పి.చిన్మయిదేవి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. వేండ్రాం అంగన్‌వాడీ కేంద్రంలో సోమ వారం ఆమె తనిఖీలు చేశారు. కేంద్రంలో రికార్డులు, స్టాకును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు,గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని చెప్పారు. పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడా కార్యకర్తల దేనని అన్నారు. వైద్య సిబ్బంది బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు వేస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. ఆర్జేడీ వెంట గంట్యాడ ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, సూపర్‌వైజర్ జానకి, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం..



పూసపాటిరేగలో ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసిన పొలాలు

- గ్రామాలలో మట్టి నమూనాల సేకరణ
- వేసవి దుక్కులు ప్రారంభించిన రైతులు
- నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

పూసపాటిరేగ: ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గతేడాది కంటే ఈఏడాది ముందుగా వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు దుక్కులు ప్రారంభించారు. 2025 – 26 ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభం కానుంది. దీంతో అధికారులు భూసారం తెలుసుకొని సూక్ష్మపోషకాలు అందించేందుకు మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. సాగుదారు కార్డులు జారీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, నువ్వు సాగు చేసే రైతులు వేసవి దుక్కులు చేస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టనున్నారు. కుమిలి కాలువ, పాలవలస చానల్, తోటపల్లి కాలువ పరిధిలో రైతులు వరి, మొక్కజొన్న సాగుకు సన్నద్ధమవుతున్నారు. తక్కువ నీటి వనరులు, తక్కువ పెట్టుబడులతో చేపట్టే సేంద్రియ సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల్లో ప్రధానంగా వరి, మొక్కజొన్న సాగుకు రైతులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు సంబంధించి కుమిలి కాలువ కింద అత్యధికంగా సుమారు 12 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగు చేపట్టనున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు జీలుగు, పిల్లిపెసర, జనుము విత్తనాలు సరఫరా జరిగింది. ప్రధాన పంటలకు ముందు సాగు చేసేందుకు రైతులకు సుమారు ఐదు వేల క్వింటాళ్ల నవధాన్యాలు పంపిణీ చేయనున్నారు. నవధాన్యాలు వేసిన తర్వాత మొక్కదశలో కలియ దున్నితే భూసారం పెరగడంతో పాటు సాగులో అధిక దిగుబడులు వస్తాయి.

సుమారు మూడు వేల క్వింటాళ్లు..

నియోజకవర్గ పరిధిలోని రైతులకు సుమారు 3 వేల క్వింటాళ్ల వరకు వరి విత్తనాలు అవసరమవుతాయని వ్యవసాయాధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రైవేట్ డీలర్ల ద్వారా అత్యధికంగా విత్తనాలు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంటీయూ 1121, బీపీటీ 5204, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318 రకాలకు డిమాండ్ ఉండడంతో సరఫరా చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే వ్యవసాయ సాగుకు ముందు వేయాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేశారు. గతంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై సరఫరా జరిగేవి. నేటి పరిస్థితి భిన్నంగా మారింది.

మట్టి నమూనాలు సేకరించాం..



పూసపాటిరేగ మండలంలో 1020 మట్టి నమూనా శాంపిల్స్‌కు గాను ఇప్పటికే దాదాపు 95 శాతానికి పైగా శాంపిల్స్ సేకరించాం. దాదాపు అన్ని గ్రామాలలో మట్టి నమూనా శాంపిల్స్ సేకరించాం. మట్టి నమూనా ఫలితాలను బట్టి సాగుపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఇప్పటికే మండలంలో ముందుగా వర్షాలు కురియడంతో రైతులను ఖరీఫ్ సాగుకు సన్నద్ధం చేస్తున్నాం. వరి, మొక్కజొన్న విత్తనాలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పిల్లిపెసర, జీలుగు, జనుమ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి.

– కె. నీలిమ, మండల వ్యవసాయ అధికారి, పూసపాటిరేగ.

మర్యాదపూర్వక కలయిక..



విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును ఆ పార్టీ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కేవీజీ సత్యనారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ సంస్థాగత నియామకాల్లో భాగంగా ఇటీవల సత్యనారాయణకు విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడిగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ధర్మపురిలో గల జిల్లా పరిషత్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఇరువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

– విజయనగరం

కేవలం రెండు వినతులే..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి రెండు వినతులు మాత్రమే వచ్చాయి. కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తెలియజేసే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ నీటి పంపిణీ చేపడుతున్నామన్నారు. ఆంధ్ర జలాశయం నుంచి ఇప్పటికే నెల్లిమర్ల వాటర్ వర్క్స్ వద్దకు నీరు చేరిందని.. వేసవిలో నీటి ఇబ్బందులు ఉండకపోవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఈ టి.రాయల్‌బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రమణమూర్తి, మేనేజర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



సమ్మె విజయవంతం చేయాలని కోరుతున్న వివిధ యూనియన్ల నాయకులు

విజయనగరం గంటస్తంభం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు నాయకుడు కె.అప్పలసూరి పిలుపునిచ్చారు. స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మే 10న విజయనగరంలో సదస్సు నిర్వహించాలని.. 16,17,18 తేదీల్లో జిల్లా, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, బైక్ ర్యాలీ చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహనరావు పెట్టిన ప్రతిపాదనను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి పి.శంకరరావు, కె.సురేష్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బెహరా శంకరరావు, రైతు సంఘ అధ్యక్షుడు బి.రాంబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌శక్తులకు దోచిపెడుతున్న వారిపై దేశద్రోహం కేసులు నమోదు చేయాలన్నారు. దేశ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులు, ప్రజలపై ఉందని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, రవికుమార్, కె.గురుమూర్తి, అప్పలరాజు, గౌరినాయుడు, కె.ఆదినారాయణ, పాపారావు, రమణ, హరీష్, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు ఆపాలి



ఆర్టీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న ఆర్టీసీ ఎన్ఎంయూ కార్యకర్తలు

- ఎన్ఎంయూ జిల్లా కమిటీ వినతి

విజయనగరం అర్బన్: ఆర్టీసీ కార్మికులపై సంస్థ అధికారులు చేపడుతున్న కక్ష సాధింపు చర్యలను ఆపాలని కోరుతూ విజయగనరం డివిజన్ ఆర్టీఓ కార్యాలయం ఎదుట ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా కమిటీ సోమవారం ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సంస్థ ఉన్నతాధికారులు ఉద్యోగులపై ఇచ్చిన క్రమశిక్షణ చర్యలను 01/2019 సర్క్యులర్ మేరకు అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై ఆరు నెలలుగా ఆర్టీసీ అధికారులకు చెప్పుకుంటున్నప్పటికీ పరిష్కారానిక చొరవ చూపించకపోగా.. ఇంకా కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెజిస్టీరియల్ అధికారాలు ఉన్న ఆర్డీఓ స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ దాట్ల కీర్తికి వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పీజే రాఫిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం జోనల్ కార్యదర్శి బీఎస్ రాములు, డిపో అధ్యక్షుడు బి.రామారావు, డిపో కార్యదర్శి కె.చంద్రమౌళి, ఎంఎస్‌లక్ష్మి, మంగమ్మ, ఎంఎ లక్ష్మి, ఎల్‌డీ లక్ష్మీప్రసాద్, పీఎస్ అప్పడు, తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- ఇండియన్ నేవీ కమోడర్ మనోజ్ భూరారియా



కార్యక్రమంలో మాట్లాడుతున్న మనోజ్ భూరారియా

డెంకాడ: సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ముందకు సాగితే మంచి ఫలితాలు సాధించగలమని ఇండియన్ నేవీ కమోడర్ మనోజ్ భూరారియా అన్నారు. మండలంలోని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రక్షణ ఆధారిత నాయకత్వ ఫ్యాకల్టీ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూరారియా మాట్లాడుతూ.. సవాళ్లు ఎదురైనప్పుడు చురుకుగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో అధ్యాపకులు శిక్షణ పొందడం హర్షణీయమన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు వివరించి వారిని ఉత్తమ నాయకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కోస్ట్‌గార్డ్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ దేవానంద్ పిళ్లై వర్చువల్ విధానంలో మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

అప్రమత్తంగా ఉండాలి..

విజయనగరం: రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచనలతో నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణమే విజయనగరం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో సమాచారం అందించాలన్నారు. 98499 06486 ఫోన్ నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందివ్వాలని సూచించారు. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున భారీ చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్‌ల సమీపంలో ప్రజలు ఉండరాదని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో ప్రయాణాలు కూడా చేయవద్దని సూచించారు.

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ సత్యవాణి

చీపురుపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఓటరు నమోదు అధికారి, ఆర్డీఓ జి.వి.సత్యవాణి సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్కా ఓటర్ల జాబితా కోసం ప్రతీ నెలలో మొదటి సోమవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, అలాగే మృతి చెందిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సి ఉంటుందన్నారు. జాబితాల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కూడా ఉందని చెప్పారు.ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఈశ్వరమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సూర్యకాంతం, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని, రాజకీయ పార్టీల ప్రతినిధులు పీతల మురళి, గవిడి నాగరాజు, విజనగిరి శ్రీను, కోట్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

వేపాడ: మండలంలో ముగ్గురు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు రావడంతో రిలీవ్ చేశామని ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ సోమవారం తెలిపారు. వేపాడ,నల్లబిల్లి, రామస్వామిపేట సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు కె.సత్యవతి, ఆర్.సత్యంనాయుడు, ఎం.సంతోష్ గ్రేడ్–6 నుంచి గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు పొందారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



బోరు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి హడ్కోకాలనీలో కమ్యూనిటీ హాల్ వద్ద బోరు ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బోరు ఏర్పాటుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, ఎంపీటీసీ గిరడ రాందాసు, నాయకులు పతివాడ రాజారావు, దుర్గారావు, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లతో ఆరోగ్య పర్యవేక్షణ

- డీఎంహెచ్ఓ జీవనరాణి



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణకు.. మాతా, శిశు మరణాలు తగ్గించడానికి యాప్‌లు ఉపయోగపడతాయని డీఎంహెచ్ఓ జీవనరాణి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆశ యాప్‌లో కొత్తగా పొందుపరిచిన రికార్డులు, రిజిస్టర్లు, మాడ్యూల్ వివరాలు తెలుసుకోవాలన్నారు. మంగళవారం నిర్వహించే ఆశాడే సమావేశంలో శిక్షణలో నేర్చుకున్న అంశాలను తెలియజేయాలన్నారు. ఆశవర్కర్లు తమ రోజువారీ పనిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఎల్ఓ డాక్టర్ రాణి, డీఐఓ డాక్టర్ రెడ్డి అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ, డీపీహెచ్ఎన్ఓ సత్యవతి, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

- కమిషనర్ పల్లి నల్లనయ్య



అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగర పరిధిలో ఎటువంటి అనుమతుల్లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితిల్లోనూ ఉపేక్షించబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది ఎన్‌సీఎస్ రోడ్‌లో ఉన్న నిర్మాణాన్ని సోమవారం తొలగించారు. అనుమతుల్లేకుండా నిబంధనలకు విరుద్ధంగా దుకాణ సముదాయాన్ని నిర్మించడంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గతంలోనే యజమానికి నోటీసులు జారీ చేశారు. అయితే సంబంధిత యజమాని కోర్టును ఆశ్రయించారు. అయితే తాజాగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు కమిషనర్ పల్లి నల్లనయ్య సూచనలతో ప్రణాళిక విభాగం సిబ్బంది నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. నూతన నిర్మాణాలకు ప్రభుత్వం సులభతరమైన విధానంలో అనుమతులు మంజూరు చేస్తోందని చెప్పారు. అయినప్పటికీ కొంతమంది అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని.. ఇది చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ సహాయంతో నూతన నిర్మాణాలకు అనుమతులను పొందాలని సూచించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మెరకముడిదాం మండలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్ సోమవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంగంరెడ్డి వివేక్, తాడేల రేవంత్ భవిష్యత్‌లో మరింత బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం టాపర్లుగా నిలిచిన ఇద్దరు విద్యార్థులతో విమాన ప్రయాణం చేయించిన గోపన్నవలస జెడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు మరడాన సత్యారావును అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఈఓ గౌరీశంకరరావు, డిప్యూటీ డీఈఓ కేవీరమణ, ఏపీసీ డాక్టర్ రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ టి.సన్యాసిరాజు, ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, మరడాన ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.